
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఖమ్మం

5

బుధవారం 22 అక్టోబరు 2025



శివయ్యకు ప్రీతికరం.. కార్తీకం..

- నేటినుంచి కార్తీక మాసం
- ఆకాశ దీపంతో ఆరంభం
- నవంబరు 21వరకు ప్రత్యేక పూజలు



7



కూసుమంచి మండలం ధర్మాతండాలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మొదటి విడతలో 4.50లక్షల గృహాలు మంజూరు
- ప్రజా ప్రభుత్వం పేదల పక్షపాతిగా పనిచేస్తోంది
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో పర్యటన

కూసుమంచి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ ప్రజా ప్రభుత్వం పేదలపక్షపాతిగా పనిచేస్తోందని , అందులో భాగంగానే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో పర్యటించిన ఆయన ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నేలపట్ల, ధర్మాతండా గ్రామాల్లో పొంగులేటి మాట్లాడుతూ పేదప్రజలకు ధైర్యం, భరోసా ఇచ్చేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మొదటిదఫాలోనే ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 4.50లక్షల ఇళ్లు మంజూరు చేశామన్నారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు సంబంధించిన నిధులను ప్రతీ సోమవారం బ్యాంకుల్లో జమ చేస్తున్నామన్నారు. రైతును రాజు చేసేలా రూ.21వే లకోట్ల రుణమాఫీ, సన్నధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చామని, ప్రస్తుత సీజన్‌కు కూడా బోనస్ ఇవ్వాలని మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందన్నారు. మరో పదిరోజుల్లో ధాన్యం కొనుగోలుకేంద్రాలు ఏర్పాటుచేసి ప్రతిధాన్యపుగింజను (మిగతా 6వ పేజీలో)

రూ.37కోట్లు!

ఉమ్మడి జిల్లాలో జోరుగా బాణసంచా వ్యాపారం



ఖమ్మంలోని ఓ బాణసంచా దుకాణం వద్ద కొనుగోలు దారుల రద్దీ

- వానొచ్చినా ఆగని టపాసుల విక్రయాలు
- మిగిలిన సరుకు భద్రమేనా?
- వాటి నిల్వపై అనుమానాలెన్నో..
- అంబరాన్నంటిన దీపావళి సంబురం



దీపాల వరుసలు.. పటాకులు మోతలు.. కాకరపూల కాంతులు.. భూచక్రాల వెలుగులు.. చిచ్చు బుడ్ల జిలుగులు, పసందైన పిండివంటలు.. అల్లరి పిల్లలు.. పిల్లల్లా మారిన పెద్దలు.. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దీపావళి సంబురం అంబరాన్నంటింది. ఈ క్రమంలో ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా బాణసంచా కొనుగోళ్లు భారీగా సాగాయి. ఖమ్మం జిల్లాలో రూ.30కోట్ల మేర టపాసుల వ్యాపారం జరగ్గా.. భద్రాద్రి జిల్లాలో సుమారు రూ.7కోట్ల విక్రయాలు జరిగినట్టు అంచనా. సోమవారం సాయంత్రం సమయంలో పలు చోట్ల వర్షం పడినా టపాసుల అమ్మకాలు మాత్రం జోరు తగ్గలేదు.

ఖమ్మంఖానాపురంహవేలి / కొత్తగూడెం సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో లక్ష్మీ పూజలు నిర్వహించారు. మహిళలు ఇళ్లలో బొమ్మలకొలువులను ఏర్పాటు చేశారు. రంగురంగుల పూలు, మామిడి తోరణాలతో దుకాణాలు, ఇళ్లను అలంకరించారు. సోమవారం రాత్రి ఓ వైపు వర్షం పడుతున్నా బాణాసంచా మోతలు మాత్రం ఆగలేదు. వాన రావడంతో అమ్మకాలు ఆగిపోతాయేమోనని వ్యాపారులు ఆందోళన చెందినా.. రాత్రి 8 గంటల నుంచి టపాసుల విక్రయాలు మరింత ఊపందుకున్నాయి. దీంతో ఖమ్మం ఎస్సార్‌అండ్‌బీజీఎన్నాఆర్, పెవిలియన్ గ్రౌండ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

రూ. కోట్లలో సాగిన వ్యాపారం..

దీపావళి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.37కోట్ల మేర బాణసంచా వ్యాపారం జరిగినట్టు అంచనా. ఇందులో ఖమ్మం జిల్లాలో రూ.30కోట్ల మేర టపాసుల విక్రయాలు జరిగినట్టు అంచనా.. కాగా భద్రాద్రి జిల్లాలో సుమారు రూ.7కోట్ల మేరకు అమ్మకాలు సాగినట్టు తెలుస్తోంది. ఇందులో లైసెన్స్ లేకుండా ప్రభుత్వ ఆదాయానికి కొందరు వ్యాపారులు గండికొట్టినట్లు సమాచారం. ఎలాంటి పన్నులు చెల్లించకుండా అనుమతులు లేని టపాసులను పక్కనే ఉన్న ఏపీ నుంచి తీసుకొచ్చి వాటిపై అధిక ధరలు ముద్రించి రూ.కోట్లు గడించారనే వాదనలు వినిపిస్తున్నాయి. టపాసుల విక్రయాల వద్ద అధికారుల తనిఖీలు లేకపోవటంతో భారీ ఎత్తున జీరో (ఎలాంటి పన్నులు లేకుండ) అమ్మకాలు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భద్రాద్రి జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 163 తాత్కాలిక బానాసంచా దుఖానాలను విక్రయదారులు ఏర్పాటుచేసి అమ్మకాలు సాగించారు. సగటున ఒకొక్క షాపు వారి పెట్టుబడిన బట్టి రూ.3 లక్షల నుంచి రూ 5 లక్షల బానాసంచా విక్రయాలు చేసినట్లు సమాచారం. అయితే ఇంకా 20నుంచి 30 శాతం బాణాసంచాలు మిగిలిపోయాయని నిర్వాహకులు చెబుతున్నారు.

మిగిలిన సరుకెక్కడ ?

ఏటా టపాసుల విక్రయాల అనంతరం మిగిలిన సరుకును ఎక్కడకు తరలిస్తారనే అనుమానాలు వస్తుంటాయి. ఈ ఏడాది కూడా ఖమ్మం నగరంలోని (మిగతా 7వ పేజీలో)

డీసీసీ పీఠాలు దక్కేదెవరికో?

- పూర్తయిన దరఖాస్తుల ప్రక్రియ
- పైరవీల్లో ఆశావహులు
- 24న స్పష్టత వచ్చే అవకాశం





ఖమ్మం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పీఠాలను అధిరోహించే నేతలెవరనే ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. ఈ సారి కొత్తవారికి అవకాశం దక్కనుండటంతో.. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు కాంగ్రెస్ వర్గాలు పోటీపడుతున్నాయి. ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్ష పదవులకు దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ పూర్తయిన విషయం తెలిసిందే.

అధ్యక్ష పదవుల కోసం భారీగా దరఖాస్తులు

ఖమ్మం నుంచి ఏఐసీసీ పరిశీలకుడిగా మహేంద్రన్ వచ్చి ఐదు నియోజకవర్గాల్లో తిరిగి అందరి అభిప్రాయాలతో పాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరితో ప్రత్యేకంగా సమావేశమై అభిప్రాయాలు సేకరించారు. వీరితో పాటు నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తలు, నాయకులు కూడా తమతమ అభిప్రాయాలు చెప్పడంతో పాటు డీసీసీ పదవికి 55 మంది దరఖాస్తు చేశారు. ఖమ్మం నగర అధ్యక్ష పదవికి కూడా 11మంది దరఖాస్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష పదవికి కూడా ఏఐసీసీ పరిశీలకుడిగా వచ్చిన జాన్సన్ అబ్రహాం అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకున్నారు. ఈ క్రమంలో అక్కడి అధ్యక్ష పదవి కోసం 25కుపైగా దరఖాస్తులు వచ్చాయి అయితే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులుగా పనిచేసిన పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పొదెం వీరయ్యలు మాత్రం దరఖాస్తు చేయలేదు అలాగే ఖమ్మంనగర అధ్యక్షుడుగా కొనసాగుతున్న జావీద్ కూడా నగర పదవి కాని, జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తు చేయలేదు. అయితే ఈనెల 24న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలపై ఢిల్లీలో ఏఐసీసీ పరిశీలకులు నివేదిక ఇచ్చే అవకాశం ఉంది. అదేరోజు అభ్యర్థుల ఎంపిక కూడా ఉంటుందని పార్టీవర్గాల్లో ప్రచారం జరుగుతుంది.

కుల సమీకరణలు..

జిల్లాస్థాయిలో ఏఐసీసీ పరిశీలకులు వచ్చిన దరఖాస్తుల నుంచి ఆయావర్గాల కులాలవారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీవర్గాలనుంచి కొన్ని పేర్లు ను నివేదిక ద్వారా పంపనున్నారు. దీంతో జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవుల ఆశావహులు తమ నాయకులతో పైరవీలు నడిపిస్తున్నారు. దీంతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుల కోసం కొందరు ఆశావహులు ప్రయత్నిస్తున్నారు. మధిర నియోజకవర్గం నుంచి ఒక ఓసీ, ఒక బీసీ వర్గానికి చెందిన నేత డీసీసీ పదవిపై దృష్టిపెట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లానుంచి (మిగతా 8వ పేజీలో)


బీటీపీఎస్ మూడు
యూనిట్ల నిలిపివేత

- ఒక్క యూనిట్ నుంచి కొనసాగుతున్న విద్యుత్ ఉత్పాదన
- 'హైడ్రా' స్టేషన్ల ద్వారా సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- కేటీపీఎస్‌లోనూ నిలిచిన ఉత్పత్తి



6

దాతల సహకారంతోనే..
సమృద్ధి..



- రామయ్యకు వివిధ రూపాల్లో విరాళాలు అందజేస్తున్న భక్తులు
- నేడు భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో దాతలకు సత్కారం

7

శాంతియుత సమాజ స్థాపనే లక్ష్యం







పోలీసు అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అటవీశాఖ జిల్లా అధికారి, సిబ్బంది

- ప్రజల భద్రతలో పోలీసు వ్యవస్థ కీలకం
- అమర పోలీసుల స్ఫూర్తితో పనిచేయాలి
- కలెక్టర్ అనుదీప్, సీపీ సునిల్ దత్
- ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ఖమ్మంక్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతియుత సమాజ స్థాపనే లక్ష్యంగా.. ధైర్యసాహసాలను ప్రదర్శించి అమరులైన పోలీసుల స్ఫూర్తితో పనిచేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీసు కమిషనర్ సునిల్‌దత్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సిటీ ఆర్మడ్ పోలీసుహెడ్‌క్వార్టర్స్ పరేడ్ మైదానంలో స్మృతి పరేడ్ నిర్వహించారు. తొలుత పోలీసు అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్ అనుదీప్, సీపీ సునిల్‌దత్, జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్, పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబీకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. సాయుధ బలగాలు పరేడ్, గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించాయి. అనంతరం దేశవ్యాప్తంగా ఈ ఏడాది విధినిర్వహణలో అసువుల బాసిన 191మంది అమరవీరుల పేర్లను ఏడీసీపీ కుమారస్వామి చదివి వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ పోలీసు అమరులను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలో పోలీసుల సహకారంతో యంత్రాంగం ప్రశాంతంగా, సమర్థవంతంగా విధులు నిర్వహిస్తోందన్నారు. పండుగలు కూడా లేకుండా పోలీసులు మాత్రమే శాంతి భద్రతలు కాపాడుకుంటూ విధులు నిర్వహిస్తారన్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి అమరులైన వారి జీవితాలను ఆదర్శంగా తీసకుని సమాజసేవలో ముందుండాలన్నారు. పోలీసు కమిషనర్ సునిల్‌దత్ మాట్లాడుతూ ప్రజారక్షణ కోసం అహర్నిశలు తమప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమని, శాంతిభద్రతల కట్టడిలో పోలీసు వ్యవస్థ చాలా కీలకంగా పనిచేస్తుందన్నారు. పోలీసులు తమ కుటుంబాన్ని, వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి ప్రజల కోసం జీవితాలు అంకితం చేశారని అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా 24వతేదీన రక్తదాన శిబిరం, 25న సైకిల్ ర్యాలీ, 27న పోలీసు సిబ్బందికి వ్యాసరచనపోటీలు, 28న విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు, అవగహన కార్యక్రమాలు, ఆన్‌లైన్ ఓపెన్‌హౌజ్, నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పోలీసు అమరవీరులకు నివాళులర్పిచేందుకు వచ్చిన వారి కుటుంబీకులు, బంధువులు స్థూపం వద్ద పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీసీపీలు రామానుజం, ప్రసాదరావు, ఏసీపీలు రమణమూర్తి, సాంబరాజు, సుశీల్‌సింగ్, నరసయ్య, ఆర్‌ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, సాంబశివరావు, అప్పలనాయుడు, నాగుల్‌మీరా, సీఐలు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్‌బాబు, భానుప్రకాష్, రాజిరెడ్డి, రామకృష్ణ, చిట్టిబాబు, సత్యనారాయణ, ఉస్మాన్‌షరీఫ్, స్వామి, పోలీసు అసోసియేషన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్ - 2047

సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి

- ఈ నెల 25తో ముగియనున్న సర్వే
- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్-2047 సిటీజన్ సర్వేలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 247 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుంచి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ - 2047 సిటీజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈ నెల 25వ తేదీతో ముగుస్తుంది. ఈ సర్వేలో రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ.జీవోవీ.ఐఎన్/తెలంగాణ రైజింగ్ అనే వెబ్ సైట్‌ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు, సూచనలను అందించాల్సిందిగా కోరారు.



నీలాకాశంలో ప్రకృతి చిత్రాలు

- రంగుల మబ్బుల తెప్పలు ఆవిష్కృతం
- చూపారులకు కనువిందు చేసిన దృశ్యాలు

కరకగూడెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆకాశంలో ప్రకృతి అందాలు కనువిందు చేశాయి. సాయం సాధ్య సమయంలో కరకగూడెం మండలంలో సోమవారం కారుమబ్బులు అలుముకున్నాయి. ఆదివారం రాత్రి మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. సోమవారం కూడా ఎండతో పాటు సాయంత్రం సమయంలో నింగి ఆకాశంలో రంగుల హరివిల్లులా మబ్బులు ప్రకృతి అందాలుగా మారాయి. తెల్లని మబ్బులు, ఎర్రని మబ్బులు ఏర్పడటంతో చూపారులను కనువిందు చేశాయి. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.



ఉద్యమ బాటలో పెన్షన్ దారులు

- జూబ్లీహిల్స్ నామినేషన్‌లో మాజీ ఉద్యోగులు
- ఎన్‌హెచ్ఆర్సీ, కాంగ్రెస్ నాయకులకు ఫిర్యాదులు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 694 పెన్షనర్ల ఆవేదన

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు అపరిష్కృతంగా ఉండడంతో పెన్షన్ దారులు ఆందోళన బాట పడుతున్నారు. 2024 మార్చినెల తర్వాత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 694 పైగా పెన్షన్ దారులకు ఎలాంటి సొమ్ములు రాకపోవడంతో జిల్లాల వారీగా(రేవా) కమిటీలను ఎన్నుకొని నేరుగా ప్రభుత్వంపై ఆందోళనకు దిగుతున్నారు. జేఏసీ నాయకులు పెన్షన్ ఉద్యోగ సమస్యలపై ఉదాసీనత, ఆలసత్వం వహిస్తున్నారనే ఆవేదనతో ఉద్యమ బాటపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షన్‌దారులకు ఆరు డిఏలు బకాయిలు ఉన్నారు. గతంలో జరిగిన క్యాబినేట్ సమయంలో డీఏలు రెండు ఇస్తామని హామీ ఇచ్చి కేవలం 1 ఇచ్చి చేతులు దులుపుకున్నారని పెన్షన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీపావళికి ఒక డీఏ ప్రకటిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇటీవల జరిగిన క్యాబినేట్ సమావేశంలో ఎలాంటి ప్రస్తావన లేకపోవడంతో మారోమారు భంగపడ్డామని, తప్పనిసరి పరిస్థితుల్లో తమలో కొందరు హైకోర్టును ఆశ్రయించామని, హైకోర్టు తీర్పును ప్రభుత్వం బేఖాతరు చేయకపోవడంతో కంటెంట్ ఆఫ్ కోర్ట్ కింద కూడా కోర్టును ఆశ్రయించామని పెన్షన్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2024 మార్చి నుంచి పదవి విరమణ పొందిన వారికి పెన్షనరీ బెనిఫిట్స్, జీపీఎఫ్ నిధులు, జీఎల్ఐ నిధులు, గ్రాట్యుటీ కమిటేషన్, లీవ్ శాలరీ సకాలంలో చెల్లించకపోవడం కొందరు పెన్షన్‌దారులు జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. సకాలంలో తాము దాచుకున్న సొమ్ము కూడా చెల్లించలేదని తన కుటుంబ పోషణ కూడా కష్టంగా ఉందని, ఇంకా పలు కారణాలతో పలువురు మృత్యువాత పడ్డారు. మరికొంతమంది జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో పోటీకి దిగుతున్నారు. తాము పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి తాము వివిధ మార్గాలను ఎంచుకున్నట్లు పెన్షన్ దారుల అసోసియేన్(రేవా) అంటున్నారు. మరికొంతమంది కాంగ్రెస్ నాయకులైన సోడియం గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులకు మెయిల్స్ ద్వారా తమ ఆవేదనలను ఉత్తరాల ద్వారా పంపుతున్నామని పేర్కొన్నారు. మరి కొంత మంది మౌనదీక్షకు, రిలే నిరాహార దీక్షలకు అనుమతి కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. పెన్షన్ దారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్ వేయడానికి వచ్చిన రిటైర్డ్ ఎంపీడీవో

వైరా గురుకులాన్ని తనిఖీ చేసిన జేఎస్



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న జేఎస్ శారద

వైరా, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వైరాలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను మంగళవారం ఆవిద్యాసంస్థల రాష్ట్ర జాయిం ట్ సెక్రటరీ కె.శారదా తనిఖీ చేశారు. జిల్లాలోని ఆసంస్థకు చెందిన గురుకులాల తనిఖీల్లో భాగంగా వైరాలోని గురుకులాన్ని సందర్శించారు. ఈ పాఠశాలలోని భోజన శాల, వంట గదులు, తరగతి గదులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలో కోతుల బెడద నివారణ కోసమే పాఠశాల యాజమాన్యం కొన్ని చెట్లను నరికించారని అందులో వేరే కారణం లేదని అయినా ఈ విషయాన్ని తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ప్రిన్సిపాల్ సమత, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు: డీపీవో

తల్లాడ, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మిషన్‌భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీటి సరఫరా కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లాపంచాయతీ అధికారి ఆశాలత తెలిపారు. మంగళవారం తల్లాడ మండలం మల్లారం గ్రామాన్ని ఆమె సందర్శించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వెళ్లే ప్రకృతివనం, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా గత మూడు నెలలుగా మిషన్‌భగీరథం పథకం ద్వారా మల్లారం గ్రామానికి తాగునీటి సరఫరా నిలచిపోయిందని, పంచాయతీ కార్యదర్శి సిద్ధిక్‌మియా డీపీవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీపీవో స్పందించి మిషన్ భగీరథ పథకం ఏఈ సింధుకు ఫోన్‌చేయగా స్పందించకపోవడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకంటామి తెలిపారు. సెగ్రిగేషన్ షెడ్‌లో విధిగా తడి, పొడిచెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువును తయారుచేయాలని కార్యదర్శిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సురేస్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

వైరా, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వైరా మధు విద్యాలయంలోని 1999-2000 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. అమెరికా, లండన్, బెంగుళూర్, చెన్నై, హైదరాబాద్ వంటి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన దాదాపు 80మంది పూర్వవిద్యార్థులు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని నాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. కరోనా సమయం నుంచి ఆపదలో మిత్రులను ఆదుకుంటున్న ఈ పూర్వ విద్యార్థులు ఏఐ వీడియో ద్వారా భౌతికంగా దూరమైన మిత్రులను స్మరించుకున్నారు. మృతి చెందిన ఆరుగురు మిత్రుల పిల్లలకు రూ.30వేల ఆర్థికసాయం చేశారు.

పత్తి రైతులను ఆదుకోవాలి: సీపీఎం

ఎర్రుపాలెం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): అకాలవర్షాలకు పత్తిపంట ఆగమై పత్తిరైతులకు తీవ్ర నష్టం జరిగిందని ప్రభుత్వం రైతులకు పరిహారాన్ని అందించాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు ఆధ్వర్యంలో మండలంలోని భీమవరం, మామునూరు గ్రామాల్లో పర్యటించి అకాలవర్షాలకు దెబ్బతిన్న పత్తిపంటలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ కేంద్రాలను తెరిచి ఆంక్షలు లేకుండా క్వింటాకు రూ.15వేలు మద్దతు ధరను అందించాలన్నారు. పంటనష్టాన్ని అంచనావేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల పరిహారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దివ్వెల వీరభద్రం, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు, గొల్లపుడి పెద్ద కోటేశ్వరరావు, షేక్ కరీం, నారాయణ, కోటేశ్వరరావు, జాని, వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, రాజారావు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న సీపీఎం బృందం

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

డ్రైవర్ నిర్లక్ష్యంతో...

బోనకల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో గల ప్రదాన రహదారి పక్కన మంగళవారం డీసీఎం వ్యాన్ అతి వేగంగా ఓ వ్యక్తిని ఢీ కొట్టడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండా హూస్సేన్(40) కాంటా పనులకు వెళ్లేందుకు గానూ గ్రామంలోని మీ సేవా కేంద్రం ముందు వేచి ఉన్నాడు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి బోనకల్ వైపునకు అతి వేగంతో రాంగ్ రూట్‌లోకి వచ్చి రోడ్డు పక్కన ఉన్న హుస్సేన్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు డ్రైవర్ ప్రసాద్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు. డ్రైవర్ మద్యం సేవించి డీసీఎం నడపడం వలనే ప్రమాదం జరిగినట్లుగా గ్రామంలో ప్రజలు చర్చిస్తున్నారు.

వేంసూరులో...

వేంసూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని లచ్చన్నగూడెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పోతురాజు జార్జి(65) ఇంటి నుంచి లచ్చన్నగూడెం సెంటర్లోని షాపు వద్దకు ద్విచక్రవాహనంపై వస్తుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కాగా సత్తుపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిస అవ్వడంతో పాటు అనారోగ్య కారణాలతో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సత్తుపల్లి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ ప్రతాపరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేజర్లకు చెందిన కుంట ముక్కల శ్రీను (50) ఇంట్లో ఎవ్వరూ లేనిస మయంలో రేకుల షెడ్డుకు చీరెతో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మృతుడు మద్యానికి బానిసవ్వడంతో పాటు గత కొంత కాలంగా కామెర్ల వ్యాధితో బాధపడుతూ ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

ఖమ్మంఅర్బన్‌అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎన్ సుమంత్ డిమండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగం సమస్యల్లో చిక్కుకుందని చెప్పారు. బెస్టఅవైలబుల్ పాఠశాలలకు రూ.250 కోట్లను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉందన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల పట్ల కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వసతిగృహ విద్యార్థులకు దుప్పట్లు, వేడినీళ్లు, నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. మంత్రులు చొరవ తీసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మందసురేష్, జిల్లా నాయకులు బి.రాము, సతీష్, రమణ, శ్రావణి, భువన, వీరబాబు వేణు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు

పెనుబల్లి,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాల మేరకు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. సింగరేణి మండలం అనంతారం గ్రామానికి చెందిన వాంకుడోతు నరేష్ పెనుబల్లికి చెందిన చీపు నర్సింహారావువద్ద 2014లో 23కుంటల భూమిని కొనుగోలు చేశాడు. ఈ భూమిపై పల్లబోతుల రామకృష్ణారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తప్పుడు కాగితాలు సృష్టించారు. మాదే భూమి అని నరేష్ కొనుగోలు చేసిన భూమిపైకి వచ్చి ఇబ్బంది పెడుతున్నారని కోర్టులో ఫిర్యాదు చేశారు. ఈ భూమి ఏజన్సీ ప్రాంతంలోని గిరిజనుడికి చెందటంతో కోర్టు సూచనల మేరకు నరేష్ ఫిర్యాదు మేరకు పైముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ, పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

పొద్దుటూరులో చోరీ

చింతకాని, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. సుమారు 75 గ్రాముల బంగారం అపహరణకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇంటియజమాని పునాటి సీతయ్య కుటుంబం ఇంటికి తాళం వేసి ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు.పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం తీసి ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. ఇంట్లోకి వెళ్లి బీరువా చూడగా బంగారం కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. బంగారం విలువ రూ.10 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ఘటనాస్థలిని ఎస్ఐ వీరేందర్ పరిశీలించి ప్రాథమిక వివరాలు సేకరించారు. సీతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీటీపీఎస్ మూడు యూనిట్ల నిలిపివేత

- ఒక్క యూనిట్ నుంచి కొనసాగుతున్న విద్యుత్ ఉత్పాదన
- 'హైడ్రా' స్టేషన్ల ద్వారా సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

మణుగూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలోని హైడ్రా పవర్ స్టేషన్ల నుంచి విద్యుత్ సేకరించాలని, థర్మల్ పవర్ స్టేషన్ల నుంచి కొంతమేర ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని మూడు యూనిట్ల నుంచి 20రోజులుగా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసిన అధికారులు.. ఒక్క యూనిట్ ద్వారా 270 మెగా యూనిట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపుతున్నారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకపోయినా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటి, రెండు, నాలుగు యూనిట్లను నిలిపేసినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ మూడు యూనిట్లలో పనిచేసే కార్మికులు, ఇంజనీర్లు, ఇతర అధికారులు ఖాళీగా ఉండాల్సిన వస్తోందని సమాచారం. బీటీపీఎస్ నుంచి ఒక్కో యూనిట్ విద్యుత్ ఉత్పత్తికి దాదాపు రూ.5 నుంచి రూ.7 వరకు ఖర్చు అవుతుండగా హైడ్రో పవర్ ప్రాజెక్టుల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు కేవలం రూ.2నుంచి రూ.4 మాత్రమే ఖర్చవుతోంది. దీంతో థర్మల్ పవర్ స్టేషన్‌లో(సబ్ క్రిటికల్) విధానంలో నడిచే స్టేషన్లలోని యూనిట్లను నిలిపేశారని తెలుస్తోంది.

గ్రిడ్‌లో పవర్ ఎక్కువగా ఉండటంతోనే.. బిచ్చన్న, బీటీపీఎస్ సీఈ

ప్రస్తుతం గ్రిడ్‌లో పవర్ ఎక్కువ ఉంది. డిమాండ్ తగ్గింది. అంటే జూరాల, పులిచింతల, నాగార్జున సాగర్ లాంటి హైడల్ పవర్ స్టేషన్ల నుంచి చౌకగా విద్యుత్ లభిస్తున్న క్రమంలో వాటి ద్వారా విద్యుత్‌ను తీసుకుంటున్నారు. బీటీపీఎస్‌లోని ఒకటి, రెండు, నాలుగు యూనిట్లను రిజర్వ్ షెడ్ డౌన్‌లో ఉంచాం. స్టేట్ లోడ్ డిశ్పార్జ్ సెంటర్ ఆదేశాల మేరకు నిలిపేశాం. మణుగూరు బీటీపీఎస్‌తో పాటు ఎన్‌టీపీసీ తదితర థర్మల్ పవర్ జనరేట్ స్టేషన్లలో ఇలా యూనిట్ల నిలుపుదల చేశారు.

కేటీపీఎస్‌లోనూ నిలిచిన ఉత్పత్తి

పాల్వంచ: పాల్వంచ కేటీపీఎస్ 5,6 దశల్లోని రెండు యూనిట్లలోనూ విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. విద్యుత్ డిమాండ్ లేకపోవడంతో అధికారులు గత నెల 29న రెండు యూనిట్లను నిలిపి వేసారు. కాగా 7వ దశలోని యూనిట్‌ను మాత్రం అధికారులు నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. విద్యుత్ డిమాండ్ పెరిగి ఆయా యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తిని పునఃప్రారంభించే సమయాల్లో ఎలాంటి అంతరాయాలు ఏర్పడకుండా ఉండాలంటే కనీసం ఒక్కో యూనిట్‌ను యథావిధిగా కొనసాగించాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు.

యాచకుల లెక్క తేల్చారు

- మునిసిపాలిటీల్లో మెప్మా సర్వే
- ఖమ్మం జిల్లావ్యాప్తంగా 142 మంది గుర్తింపు



సర్వే చేస్తున్న మెప్మా సిబ్బంది

ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సూచనల మేరకు ఖమ్మం జిల్లాలోని మునిసిపాలిటీల్లో యాచకులను గుర్తించారు. మెప్మాఅధికారులు వారం రోజులుగా ఖమ్మం నగరంతో పాటుగా మధిర, వైరా,ఏదులాపురం, కల్లూరు, సత్తుపల్లి మునిసిపాలిటీల్లో ఈ సర్వే నిర్వహించారు. 142మంది నిత్యం బిక్షాటన చేసే వారిని గుర్తించారు. ఒంటరి మహిళలు, వయోవృద్ధులు, దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి. అయితే కుటుంబ సభ్యులు లేక పోవటం, ఆర్థిక తోడ్పాటు లేక పోవటం, శరీర అవయవాలు సహకరించక పోవటంతో కొంత మంది యాచకులుగా మారుతున్నారు. పట్టణాల్లో కూడల్లు, రైల్వేస్టేషన్‌లు, ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో వీరు యాచిస్తున్నారు. అలా యాచించే వారికి ఏదైనా తోడ్పాటు ఇవ్వటానికి ప్రభుత్వ సూచనలతో మెప్మా అధికారులు సర్వే పూర్తి చేశారు. వారి ఆర్థిక సామాజిక పరిస్థితిని నమోదు చేశారు.

142 మంది గుర్తింపు

జిల్లావ్యాప్తంగా రెగ్యూలర్‌గా యాచించే వారిని గుర్తించారు.జిల్లావ్యాప్తంగా 142 మంది నిత్యం బిక్షాటన చేసే వారిని గుర్తించారు. ఖమ్మం నగరంలో61, ఏదులాపురం35(లెప్రెసీ కాలనీతో), మధిర7, కల్లూరు 2, సత్తుపల్లి 19, వైరా 18మందిని మెప్మా బృందాలు గుర్తించాయి. యాచకుల వివరాలను ప్రభుత్వానికి నివేదించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

(5వ పేజీ తరువాయి)

సేకరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఉచిత విద్యుత్, రేషన్‌కార్డుల మంజూరు, సన్న బియ్యం పంపిణీ అమలు చేస్తున్నామని, గత 22నెలల కాలంలో ప్రజల ఆశీర్వాదంతో అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, అంతర్గత సీసీరోడ్లు, లింకురోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్మించే బీటీరోడ్ల నిర్మాణం ద్వారా రోడ్ కనెక్టివిటీతో పాటు పంట కొనుగోలు కేంద్రాలకు తరలించే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు రోడ్ల నిర్మాణాలను నాణ్యతతో వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ యాకోబ్, పీఆర్ ఎస్ఈ వెంకటరెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తొమ్మిదిమంది పేకాట రాయుళ్ల అరెస్టు

పెనుబల్లి,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యన్నగూడెంలో మంగళవారం పాడుబడ్డ ఇంట్లో పేకాటాడుతున్న తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3వేల నగదుతోపాటు 52పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు.

కల్లూరులో ద్విచక్రవాహనాల చోరీ

కల్లూరు,అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) కల్లూరు పట్టణ పరిసర ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తులు పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్నారు. ఈ సంఘటనలకు సంబంధించి స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని పేరువంచ గ్రామానికి చెందిన కీసర వంశీకృష్ణారెడ్డి దీపావళి సామగ్రి కొనుగోలు కోసం సోమవారం రాత్రి 7 గంటల సమయంలో కల్లూరు ఎన్నెస్పీ క్రాస్ రోడ్డు సమీపాన గల వినాయక ఫైర్ వర్క్స్ వద్దకు వచ్చాడు. షాపు ఎదుట పార్కు చేశాడు. ఆయన దుకాణంలోకి వెళ్లగానే వాహనాన్ని చోరీ చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ డి హరిత మంగళవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కల్లూరులోని తిరుమలగిరినగర్‌లో సోమవారం రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేసిన మరో ద్విచక్రవాహనాన్ని కూడా చోరీ చేశారు. తిరుమలగిరి నగర్‌కు చెందిన మల్లోజు వీరాచారి గతరాత్రి ఇంట్లో వాహనాన్ని పార్కింగ్ చేశాడు. మంగళవారం ఉదయం చూడగా వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల గాలించిన తమ ద్విచక్రవాహనం కన్పించక పోవటంతో వీరాచారి పోలీసులను ఆశ్రయించాడు. ఇలా కల్లూరులో కొంతకాలం నుంచి ద్విచక్రవాహనాలు చోరీ సంఘటనలు జరుగుతన్నాయి. దీనిపై పోలీసుశాఖ వారు ప్రత్యేక నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక లారీ పట్టివేత

పెనుబల్లి,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని వీఎంబంజర్ ఎస్ఐ కె.వెంకటేష్ సోమవారం రాత్రి పట్టుకున్నారు. ఆంధ్రాలోని కొవ్వూరు నుంచి హైదరాబాద్‌కు లారీలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలోని మండాలపాడు గ్రామం వద్ద ఎస్ఐ వెంకటేష్ తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. లారీలో ఇసుకను తీసుకురావాలని డ్రైవర్‌కు చెప్పినందుకు సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన కంచేటి వినీల్‌కుమార్ అనే యజమానిపైన, అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మధిర మండలం మునగాలకు చెందిన గుజ్జు మోహన్‌రావు డ్రైవర్‌పైన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొవ్వూరు నుంచి హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్న లారీకి ముందు మాత్రమే నెంబర్ ఉంచారు. వెనుకవైపు కనీసం నెంబర్ ప్లేట్ పెట్టేందుకు బోర్డు కూడా లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకొనేందుకు ముందు నెంబరే కానీ వెనుక వైపు నెంబర్ లేకపోవడంతో అధికారులకు దొరక్కకుండా తప్పించుకునే ప్రయత్నాల్లో భాగంగానే కావాలనే బోర్డు తీసివేసి అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



ఆర్‌అండ్‌బీ భద్రాద్రి ఎస్ఈగా వెంకటేశ్వరరావు

లక్ష్మీదేవిపల్లి,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రోడ్లు భవనాలశాఖ ఈఈ వడ్లమూడి వెంకటేశ్వరరావు.. ఎస్ఈగా(పర్యవేక్షణ ఇంజనీర్) మంగళవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న బి.లాల్‌సింగ్ సెలవుపై వెళ్లడంతో ఆ బాధ్యతలను వెంకటేశ్వరరావుకు అధికారులు అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఈ

ఎక్స్‌రే మెషిన్ కోసం టెండర్లు ఆహ్వానం

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అక్టోబరు28లోపు ఎక్స్‌రే మెషిన్ కోసం టెండర్లు దాఖలు చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి బి.కళావతిబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్స్‌రే మిషన్ సరఫరా కోసం షార్ట్ టెండర్ ఆహ్వానిస్తున్నామని ఆసక్తి ఉన్నవారు కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖఅధికారి కార్యాలయంలో టెండర్లు దాఖలు చేయాలని, తక్కువ ధరకు టెండర్ దాఖలు చేసినవారికి అక్టోబరు29 మధ్యాహ్నం టెండర్ ఖరారు చేయనున్నట్లు తెలిపారు. టెండర్ దాఖలుకు రూ.50 వేల రూపాయల డీడీ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పేరుతో తీయాలని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): క్లీనికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ప్రకారం ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.కళావతీబాయి ఆదేశించారు. మంగళవారం ఆమె అదనపు డీఎంహెచ్‌వో (ఎయిడ్స్ అండ్ లెప్రసీ)డాక్టర్ వెంకటరమణతో కలిసి నగరంలోని శ్రీసాయి నర్సింగ్ హోంను తనిఖీ చేశారు. హాస్పిటల్లో వున్న అవుట్ పేషెంట్ విభాగం, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో ఉన్న పేషంట్లను పలకరించి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందించే వైద్య సేవల ధరల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలన్నారు. ఆస్పత్రిలో ఉన్న వైద్యులు, సిబ్బంది వివరాలు రిజిస్ట్రేషన్ సమయంలో అందించిన వివరాలతో సరిపోయాయా, లేదా పరిశీలించారు. నిబంధనలను పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శివయ్యకు ప్రీతికరం.. కార్తీకం

నేటి నుంచి కార్తీక మాసం
ఆకాశ దీపంతో ఆరంభం
నవంబరు 21 వరకు
ఆలయాల్లో ప్రత్యేక పూజలు
కార్తీక వనభోజనాలకు ఏర్పాట్లు


విద్యుద్దీపాల అలంకరణతో ముస్తాబైన ఖమ్మంలోని ఓ శివాలయం

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భక్తుల శివనామ స్మరణతో పరవశించే ఆ పరమశివుడికి ప్రీతికరమైన కార్తీకమాసం ఆరంభమవుతోంది. బుధవారం ఆకాశదీపంతో ప్రారంభం కానున్న ఈ కార్తీక మాసం.. నవంబరు 21వరకు జరగనుండగా.. ఉమ్మడి జిల్లాలోని శివాలయాలతో పాటు ఇతర ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. కార్తీకమాసంలో నెల రోజుల పాటు వ్రతాలు, నోములు, అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. భక్తులు అయ్యప్ప మాలలు ధరించటానికి వేల సంఖ్యలో ముందుగానే ఆలయాల్లో అనుమతులు తీసుకున్నారు. శివుడికి ఎంతో ప్రీతిపరమైన మాసం కావటంతో శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తుంటారు. అలాగే మహిళలు ఉసిరి చెట్లకు పూజలు చేసి దీపాలు వెలిగిస్తారు. ఈ మాసంలో చేసే ఆరాధన పాపం నుంచి విముక్తులను చేయడంతో పాటు భక్తిమార్గంలో నడిపిస్తుందని భక్తుల నమ్మకం. ఇక కార్తీక మాసంలో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కార్తీకమాసానికి సమానమైన మాసమేదీ లేదని పండితులు చెబుతున్నారు. ఈ మాసంలో ముఖ్యంగా మహిళలు వేకువజామునే కార్తీక స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే సాయంత్రం వేళ ఆలయాలలో, తులసి కోటల వద్ద కార్తీక దీపాలు వెలిగించడం ఆనవాయితీ. ఈమాసంలో ప్రతీ సోమవారం ఉపవాసదీక్షలు చేస్తారు. ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం ఆకాశ దీపం వెలిగించనున్నారు. కార్తీకమాసంలో ఒక్కోరోజుకు ఒక విశేషం ఉంది. చాలామంది భక్తులు రోజూ ఉపవాసం ఉంటూ సాయంత్రం నక్షత్ర దర్శనం అయ్యాక విరమిస్తారు. ఇక ఈనెల 25న నాగుల చవితితో పాటు ప్రతీ సోమవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి.

శివయ్య అనుగ్రహంతో ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలి

ఆకాశదీపం వెలిగించిన మేయర్ నీరజ

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పరమశివుడి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉంటుందని, ఆయన దీవెనలతో ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని నగర మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. మంగళవారం నగరంలోని గుంటుమల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీమమాసం ప్రారంభం సందర్భంగా ఆకాశదీపాన్ని వెలిగించి ధ్వజస్థంభంపైకి భక్తులకు దర్శనమిచ్చేలా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ కార్తీక మాసంలో శివాలయాలతో పాటు ఇతర ఆలయాల్లో కార్తీకమాస పూజలు ఘనంగా జరుగుతాయని, మహిళలు తెల్లవారుజామునే ప్రత్యేక పూజలలో పాల్గొని అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారన్నారు. సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలకు భక్తులకు ఇబ్బందులు కలగకుండ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలగంగాధర్ తిలక్, ఆలయ ఈవో రామకోటేశ్వరరావు, అర్చకులు దాములూరి వీరభద్రశర్మ, కృష్ణశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఖమ్మం శ్రీ గుంటుమల్లన్నస్వామి ఆలయంలో ఆకాశదీపం కార్యక్రమానికి హాజరైన భక్తులు

దాతల సహకారంతోనే సమృద్ధి..

రామయ్యకు వివిధ రూపాల్లో విరాళాలు అందజేస్తున్న భక్తులు
నేడు భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో దాతలకు సత్కారం



భద్రాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పుణ్యక్షేత్రం ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎందరో దాతలు, మహాదాతలు తమ సహకారను అందిస్తున్నారు. తమ ఆరాధ్య దైవమైన భద్రాద్రి రామయ్యకు తమవంతుగా భూమి, వస్తు, భవన, ధనరూపేణ విరాళాలుగా సమర్పించారు. 17వ శతాబ్దంలో భక్తరామదాసుగా ప్రసిద్ధిగాంచిన కంచర్ల గోపన్న భద్రాద్రి రామాలయాన్ని నిర్మించడమే కాకుండా చింతాకు పతకం, పచ్చల పతకం, మూడు సూత్రాలతో మాంగల్యం తదితర అజరామరమైన ఆభరణాలను సైతం చేయించి భక్తిప్రపత్తులతో సమర్పించి స్వామి వారిపై తన భక్తిని చాటుకున్నారు. భద్రాద్రి దేవస్థానం 2023 నుంచి దాతల సత్కారం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. గతంలో దేవస్థానం ఈవోగా పని చేసిన ఎల్. రమాదేవి ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ప్రస్తుత దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం దాతల సత్కార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఇప్పటికే ఏర్పాటు చేశారు. గత ఏడాది 1100మంది దాతలను ఆహ్వానించగా ఈసారి 1328మంది దాతలకు రావాల్సిందిగా ఆహ్వానిస్తూ సమాచారం పంపినట్లు దేవస్థానం అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో వివిధ రూపాల్లో సహకారం అందించిన దాతల ఫోన్ నెంబర్లు 450 మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉండటంతో వారికి వాట్సప్ ద్వారా, అలాగే దేవస్థానం లేఖ ద్వారా ఆహ్వానం పంపినట్లు వారు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం భద్రాచలం దేవస్థానంకు చెందిన మారుతి సదనంలో దాతల సత్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సమయంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే దాతలకు వారి గోత్ర నామాల పేరిట పూజలు, వేద ఆశీర్వచనం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం రామ అన్నప్రసాదం అందించనున్నారు. అదేవిధంగా స్వామి వారి ఫోటో, కండువా, జాకెట్‌ముక్క, ప్రసాదం, క్యాలెండర్ అందజేయనున్నారు.

రామాలయ పునరుద్ధరణ కోసం..

నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ మంత్రిగా పని చేసిన కల్లూరి చంద్రమౌళి, రామాలయ పునరుద్ధరణసంఘం అధ్యక్షుడిగా సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించారు. 1969లో భక్తుల సహకారంతో జీర్ణోద్ధరణ గావించారు. ఇదేకోవలో ఎందరో దాతలు... మహా దాతలు తమవంతుగా శ్రీరాముని సేవలో తరించారు. శ్రీసీతారామచంద్రస్వామి మూలవరులకు స్వర్ణకవచం 10.336 కేజీల బంగారంతో బెంగుళూరుకు చెందిన వి.రంగరాజు దంపతులు చేయించారు. అలాగే భారత్ బయోటెక్ లిమిటెడ్ రూ.కోటి విరాళం ను ఉచిత నిత్యాన్న దాన పథకంకు సమర్పించింది. అదేవిధంగా జీఎంఆర్ సంస్థ ఆలయం తూర్పు, దక్షిణం వైపు భక్తుల సౌకర్యార్ధం గాల్వాలియం షీట్లతో క్యూలైన్ షెడ్లను ఏర్పాటు చేసింది. అదేవిధంగా మరెందరో భక్తులు స్వర్ణ, రజతాలతో వాహనాలు పూజా పాత్రలు సమర్పించారు.

భద్రాద్రి రామాలయంలో సుదర్శన హోమం

రామయ్యను దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహీన్‌కుమార్

భద్రాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మంగళవారం సుదర్శన హోమం సంప్రదాయబద్దంగా నిర్వహించారు. ముందుగా సుదర్శన పెరుమాళ్లను యాగశాల ప్రాంగణంలోకి తీసుకొచ్చి ఆశీనులను చేశారు. అనంతరం ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సుదర్శన కలశ స్థాపన, సుదర్శన హవనం, పూర్ణాహుతి, ఆశీర్వచనం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన స్వామికి ప్రసాద నివేదన చేసి భక్తులకు పంపిణీ చేశారు. అదేవిధంగా స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహిచారు. అలాగే స్వామివారిని ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహీన్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే లక్ష్మీతాయారు ఆలయంలో వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేయడంతో దేవస్థానం తరఫున తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా పాల్గొన్నారు.


రామాలయంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహీన్‌కుమార్

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట

పత్తి రైతులను ఆదుకునేందుకు పటిష్ట చర్యలు
రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసి రైతుసంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతుందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోల్‌తండాలో భాగ్యలక్ష్మి కాటన్ మిల్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ సంచాలకులు జి.లక్ష్మీబాయితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుల బాగోగులు పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే వారికి మేలు జరుగుతుందన్నారు. ఈప్రాంతంలో ఎక్కువగా పత్తిపంట సాగు చేస్తున్నారని, రాష్ట్రంలో తొలిసారిగా పాలేరు నియోజకవర్గంలో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. ప్రస్తుత సీజన్‌లో భారీవర్షాలతో పత్తి దిగుబడి తగ్గిందని, పత్తిరైతులను ఆదుకునేందుకు సీసీఐ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. రైతులకు పత్తికి మద్దతు ధర లభించడంలేదని, దీనిపై రాబోయే పార్లమెంట్ సమావేశంలో ప్రతిపక్షనేతా రాహుల్‌గాంధీతో సమన్వయం చేసుకుంటూ పత్తికి మద్దతు ధర పెంచే విషయం చర్చను లేవదీసి మద్దతు ధర పెంపునకు కృషి చేస్తామన్నారు. తేమ పేరుతో రైతులను అనవసరం ఇబ్బందిపెడితే సహించేదిలేదన్నారు. సీసీఐ కేంద్రవద్ద వచ్చే అభ్యంతరాలను పరిశీలించేదుకు స్థానిక వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. రైతులకు అన్యాయం చేయాలని చూస్తే స్థానిక కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి ఏఎంసీ చైర్మన్ బైరు హరినాదబాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీం, ఆర్డీవో నరసింహారావు, జేడీఏ పుల్లయ్య, ఏవో సీతాంరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ చావా శివ రామకృష్ణ, స్పెషలాఫీసర్ రమేష్, మాజీ ఎంపీపీ మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.


గోల్‌తండాలో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటుసభలో మాట్లడుతున్న మంత్రి పొంగులేటి

ఇసుక అక్రమ నిల్వలు సీజ్

బూర్గంపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుకను సోమవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. బూర్గంపాడు మండల పరిధిలోని కోయగూడెం గ్రామపంచాయతీలోని ఓ పరిశ్రమలో ఇసుక నిల్వలు ఉన్నాయనే సమాచారంతో ఆర్ఐ నరసింహారావు సోమవారం దాడులు చేపట్టారు. అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన సుమారు 35 లారీల ఇసుకను సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేసిన ఇసుకను వేలం నిర్వహిస్తామని తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా నకిలీ వే బిల్లుల మాటున ఇసుకను తరలించినట్లు తెలుస్తోంది. ఇసుకను సీజ్ చేసిన వారిలో ఆర్ఐ నరసింహారావు, జీపీవో ప్రసాద్, రికార్డు అసిస్టెంట్ మల్లేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మండల పరిధిలోని ఉప్పుసాక గ్రామ శివారులో గల కిన్నెరసాని వాగు నుంచి ట్రాక్టర్లు ద్వారా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు చేపట్టారు. మంగళవారం చేపట్టిన ఈ దాడుల్లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మట్టి తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు స్వాధీనం

జూలూరుపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్‌ని, రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా.. జూలూరుపాడుకు చెందిన సిరిగద్దె శివప్రసాద్ లీజుకు తీసుకువచ్చిన జేసీబీతో మండలంలోని రాజారావుపేట గ్రామ శివారులో సీతారామ కాలువ వద్ద అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి ట్రాక్టర్లలో తరలించి విక్రయిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకి చేరుకుని జేసీబీని, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో శివ జేసీబీ తాళాన్ని తీసి పక్కన ఉన్న సీతారామ కాలువలో విసిరివేశాడు. దీంతో పోలీసులు రెండు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి, శివను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి


లోకాల రాజేశ్వరి(ఫైల్)

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దీపావళి రోజు ఆ ఇంట్లో విషాదం అలముకుంది. వేంసూర్ రోడ్డులో ద్విచక్ర వాహనం ఢీకొని చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. సోమవారం రాత్రి సత్తుపల్లి పట్టణంలోని వేంసూర్ రోడ్డులోని అన్నపూర్ణ మెస్ నిర్వహకురాలు లోకాల రాజేశ్వరి (60) నడుచుకుంటూ ఇంటికి వెళ్తుంది. ఆర్టీవో ఆఫీస్ వద్ద రోడ్డు దాటుతుండగా ఎన్టీఆర్ కాలనీ వైపు నుంచి అతివేగంగా అజాగ్రత్తగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలైన రాజేశ్వరిని విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. దీపావళి రోజే ఆ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు ఫిర్యాదు చేయడంతో సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ కండక్టర్‌పై వ్యక్తి దాడి

పోలీసులకు ఫిర్యాదు

భద్రాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ ఉమామహేశ్వరరావుపై భద్రాచలం ఆర్టీసీ బస్టాండులో మంగళవారం ఓ మహిళ ప్రయాణికురాలితో వచ్చిన వ్యక్తి దాడి చేసిన సంఘటన ఇది. ఖమ్మం నుంచి భద్రాచలం వస్తున్న బస్సు పాల్వంచ బస్టాండుకు వచ్చిన సమయంలో ఇద్దరు మహిళా ప్రయాణికులు ఎక్కగా సీటు లేకపోవడంతో కండక్టర్‌తో దూషణకు దిగి బస్సు దిగిపోయారు. అనంతరం బస్సు భద్రాచలం ఆర్టీసీ కాంప్లెక్సుకు రాగానే వారు వచ్చి మళ్లీ వాగ్వివాదంకు దిగడంతో పాటు వారితో ఉన్న వ్యక్తి కండక్టర్‌పై దాడి చేసినట్లు ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి తేవడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమంగా కలప నరికివేతపై టాస్క్‌ఫోర్స్ విచారణ


నరికిన చెట్ల కొలతలను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీఆర్వో సలోజ

జూలూరుపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని గుండెపుడి బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఇటీవల అక్రమంగా కలపను నరకడంపై కొత్తగూడెం అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం విచారణ నిర్వహించారు. మంగళవారం టాస్క్‌ఫోర్స్ డీఆర్వో సలోజ ఆధ్వర్యంలో బృందం ప్లాంటేషన్‌ను సందర్శించారు. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన ఈసం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి గుండెపుడి అటవీ ప్రాంతంలోని ప్లాంటేషన్‌లో ఈనెల 15 తేదీ రాత్రి జామాయిల్ మొక్కలను నరికి ట్రాక్టర్‌పై తరలించారు. ఈ విషయం తెలుసుకున్న జూలూరుపాడు అటవీ సిబ్బంది కలపను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు. నరికిన చెట్లకు నెంబర్లను కేటాయించారు. ఈ క్రమంలో కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ప్లాంటేషన్‌ను సందర్శించి ఎన్ని మొక్కలు నరికారో తనిఖీ చేశారు. డీఆర్వో సలోజ నరికిన మొక్కలకు సంబంధించి చెట్ల కొలతలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ప్లాంటేషన్‌లో మొక్కలు నరికివేసిన సంఘటనలో స్థానిక అటవీ సిబ్బంది ప్రమేయం ఉందని ఆరోపణలు రావటంతో దానిపై కూడా విచారణ నిర్వహించారు. 76 జామాయిల్ మొక్కలను నరికినట్లు డీఆర్వో తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెట్లు నరికిన వ్యక్తిపై ఇప్పటికే కేసు నమోదు చేయడం జరిగిందని, స్థానిక అటవీ సిబ్బంది కొలతల ప్రకారం జరిమానా విధిస్తారని తెలిపారు. నివేదికను అటవీశాఖ ఉన్నతాధికారులకు సమర్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎఫ్ఆర్వో ప్రసాదరావు, గుండెపుడి డీఆర్వో నాసుర్, టాస్‌ఫోర్స్ సిబ్బంది రాఘవ, ప్రసాద్, ఎఫ్‌బీవోలు చరణ్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో వైద్యుల నిర్లక్ష్యం

ఇష్టానుసారంగా సిబ్బంది వైద్యం
మృతి చెందుతున్న మూగజీవాలు


మృతిచెందిన దూడ

కారేపల్లి అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది ఇష్టానుసారంగా మూగజీవాలకు వైద్యం చేస్తుంటే అవి మృతిచెందడంతో తాము నష్టపోతున్నామని మంగళవారం పలువురు ఆస్పత్రి వైద్యసిబ్బందితో వాదనకు దిగారు. ఈ విషయంపై బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది మేకలు, పశువులకు వైద్యం చేయించేందుకు పశువైద్యశాలకు తీసుకువస్తున్నారు. వాటికి చికిత్స అందించాల్సిన సిబ్బంది ఇష్టం వచ్చినట్లు వైద్యం చేయడంతో పాటు కాలంచెల్లిన మందులు వాడుతుండటంతో మూగ జీవాలు మత్యువాత పడుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం గ్రామానికి చెందిన సోమందుల నాగరాజుకు చెందిన రూ.10 వేల విలువగల పందెం కోడిని వైద్యం కోసం తీసువచ్చారు. అయితే వైద్యురాలు వేసిన సూదితో అది కొద్దిసేపటికే మృతిచెందింది. దీంతో కోడిపుంజు మృతికి వైద్యాధికారే కారణమంటూ.. నష్టపరిహారంగా రూ.పదివేలు చెల్లించాలని ఘర్షణకు దిగారు. ఇదే విషయంపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఈనెల 19న మండల పరిధిలోని సామ్యాతండాకు చెందిన రైతు వాంకుడోత్ రాముకు చెందిన దూడకు ఇంటి వద్దనే నట్టల నివారణ మందుతో కూడిన సూదివేశారు.అనంత రం దూడ బహినపడటంతో ఆందోళనకు గురైన రైతు, మరునటి రోజు దూడను కారేపల్లి పశువుల ఆస్పత్రికి తీసుకువచ్చాడు. ఇక్కడ సిబ్బంది సూదులు వేయడంతో ఆ దూడ ఆదే రోజు రాత్రి చనిపోయింది. దీంతో వైద్యసిబ్బందిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరంత కలిసి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి



బ్రహ్మారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నవరంలో మంగళవారం అయ్యప్ప మాల ధారుడు శీలం బ్రహ్మారెడ్డి(26) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ.. విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గన్నవరంలోని ఇందిరమ్మ ఇంటికి వైరింగ్ చేస్తూ.. ఆ పక్కనే ఉన్న మరో ఇంట్లోని విద్యుత్ వైర్లను అమర్చే క్రమంలో షాక్ తగిలి మృత్యువాత పడ్డాడు. అతను గన్నవరంలో అంతర్యాగంగా ఉన్న గోవిందాపురంకు చెందిన యువతిని ఈఏడాది మే నెలలో కులాంతర వివాహం చేసుకున్నాడు.వివాహమైన ఐదు నెలలకే మృతిచెందడంతో భార్య, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, వైరా ఏఎంసీ చైర్మన్ బొర్రా గంగారావు, వైరా, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు బ్రహ్మారెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు.

కెమికల్ లారీ నుంచి మంటలు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు డైక్లోరో మిథేన్ రసాయనంతో వెళ్తున్న ట్యాంకర్ సత్తుపల్లిలోని పాత నగర పంచాయతీ కాంప్లెక్స్ వద్దకు చేరుకోగానే లారీ వెనుక టైర్ల వద్ద బ్రేక్ డ్రమ్‌లు పట్టేయడంతో మంటలు వ్యాపించి పొగలు వచ్చాయి. స్థానికులు సమాచారంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.

రూ.37కోట్లు!

(5వ పేజీ తరువాయి)


కొత్తగూడెంలో క్రాకర్స్ కాలుస్తున్న చిన్నారులు

దాదాపు 128 షాపులు, భద్రాద్రి జిల్లాలోని 163 షాపు ల్లో కనీసం 30శాతం సరుకు మిగిలిందని, ఆ సరుకునంతా ఎక్కడ నిల్వ చేశారనేది చర్చనీ యాం శమైంది. వాస్తవానికి జనావాస ప్రాంతాల్లో కాకుండా దూరంగా ఆ సరుకును నిల్వ చేయాల్సి ఉంటుంది. కొందరు వ్యాపారులు మిగిలిన సరుకును ఇతర వ్యాపారులకు అమ్ముకోగా.. మరికొందరు వారి వారి ఇళ్ల, వ్యాపార సముదాయాల్లోనే దాచినట్టు సమాచారం. ఈ సరుకును శుభకార్యక్రమాలు, ఇతర కార్యాలకు విక్రయిస్తుంటారని తెలుస్తోంది. టపాసులు నిల్వలకు కూడా అధికారులు అనుమతులు తప్పనిసరి. కానీ కొందరు మిగిలిన సరుకును ఎలాంటి అనుమతులు లేకుండానే ఏడాది జనావాసాల మధ్యే ఉంచి వ్యాపారాలు కొనసాగిస్తున్నారని, అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మార్కెట్‌లో పండుగ సందడి..

దీపావళి సందర్భంగా ఆది, సోమవారం జరిగిన కొనుగోళ్లతో వ్యాపార సంస్థలు కళకళలాడాయి. ప్రధానంగా వస్త్ర దుకాణాలు, పూజా సామగ్రి, ప్రమిదల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. వ్యాపారులు లక్ష్మీ పూజలను ఘనంగా నిర్వహించారు. విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

కొండగొర్రెను వేటాడిన వ్యక్తులపై కేసు నమోదు

ఆళ్లపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొండగొర్రెను వేటాడి చంపిన ఇద్దరు వ్యక్తులపై మంగళవారం ఆళ్లపల్లి అటవీశాఖ రేంజి అధికారులు కేసు నమోదు చేశారు. ఆళ్లపల్లి అటవీశాఖ రేంజర్ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 19న ఇద్దరు వ్యక్తులు ఆళ్లపల్లి రేంజి, సెక్షన్, రామానుజగూడెం బీట్‌లో ఉచ్చు వలపెట్టి కొండగొర్రెను చంపి, ఆ మాంసాన్ని లక్ష్మీపురం గ్రామంలో పలువురి ఇళ్లలో ఉంచినట్టు అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో అటవీ సిబ్బంది పలు ఇళ్లల్లో సోదాలు చేశారు. అడవి జంతువు మాంసం దొరికిన ఇంటిలోని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం మంగళవారం వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని రేంజర్ తెలిపారు. వన్యప్రాణులను వేటాడి చంపితే ఎంతటి ఉన్నత వ్యక్తులను కూడా వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప మాలధారుడి మృతి


నరేష్ (ఫైల్)

కారేపల్లి అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బొక్కలతండాకు చెందిన అయ్యప్ప మాలధారుడు మాలోత్ నరేష్ (36) సోమవారం మండల కేంద్రానికి సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు ఇంట్లో పండి వంటలు చేసుకునేందుకు బియ్యం పిండిపట్టిచేందకు తన మోటర్‌సైకిల్‌పై పిలలు చైతన్య, హిమాన్షుతో కలిసి కారేపల్లి వెళుతుండగా పెట్రోల్ బంకు సమీపంలో ఓ రైతు ఆవులను పొలానికి తోలుకెలుతున్న సమయంలో ఒక్కసారిగా బెదిరి రోడ్డు మీదకు వచ్చాయి. దీంతో నరేష్ మోటర్‌సైకిల్ ఆవులకు తగలడంతో కిందపడ్డాడు. దీంతో అతని తల వెనుక భాగాంలో బలమైనగాయం కావడంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. స్థానికులు నరేష్‌ను 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. మోటార్‌సైకిల్‌పై వెళ్లిన ఇద్దరు పిల్లలకు ఏలాంటి గాయాలు కాలేదు. మృతుడు నరేష్ వారం రోజుల క్రితమే అయ్యప్ప మాలధరించాడు. అతనికి భార్య విజయ ఉన్నారు.

పాదచారుడిని ఢీకొన్న ద్విచక్ర వాహనం

ఇద్దరికి గాయాలు


చికిత్స పొందుతున్న సిజ్జు

బూర్గంపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పాదచారుడిని ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రాత్రి గౌతమిపురంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడు మండల పరిధిలోని గౌతమిపురంకు చెందిన రవి నడుచుకుంటూ బూర్గంపాడు వైపునకు వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై అటుగా వెళ్తున్న సిజ్జు అనే యువకుడు కేజీబీవీ సమీపంలో రవిని బలంగా ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను భద్రాచలం తరలించగా వారి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఖమ్మంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఇద్దరూ ఖమ్మంలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. కాగా దీపావళిని పురస్కరించుకుని బాంబులు కాల్చడంతో దట్టమైన పొగ కమ్ముకుని, చీకటిమయం కావడంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు.

దాతల సాయం కోసం ఎదురుచూపు

ప్రమాదంలో గాయపడిన సిజ్జు అనే యువకుడికి తలకు తీవ్ర గాయం కావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ నిమిత్తం రూ.3.50 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో నిరుపేద కుటుంబానికి చెందిన సిజ్జు కుటుంబ సభ్యులు దాతలసాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్థికసాయం అందజేసి తమ కుమారుడిని బతికించాలని వేడుకుంటున్నారు.



రేపు జాబ్‌మేళా: జిల్లా ఉపాధికారి శ్రీరామ్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించేందుకు గురువారం మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటీఐ) ఖమ్మంలో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. హైదరాబాద్‌లో పనిచేసే విధంగా టెక్నీషియన్లు (ఫ్రెషర్స్) పోస్టులకు ఐటీఐ, ఎలక్ట్రికల్ ఫిట్టర్స్, టర్నర్స్ మెషినిస్టు వెల్డర్ అర్హతఉన్న 19నుంచి 22ఏళ్ల వయస్సు ఉన్న యువత అర్హులన్నారు. ట్రైయినీ టెక్నీషియన్స్ ఉద్యోగాల ఖాళీలకు 10వతరగతి ఇంటర్ ఏదైనా డిగ్రీఅర్హత కలిగిన 19నుంచి 23ఏళ్ల యువత అర్హులన్నారు. పూర్తివివరాలకు 9010584000లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా దీపావళి వేడుకలు




వేడుకల్లో పాల్గొన్న కమిషనర్ అగస్త్య కుటుంబ సభ్యులు, సీపీ సునీల్‌దత్ దంపతులు

ఖమ్మంకార్పొరేషన్: మేయర్ నివాసంలో దీపావళి వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకున్నారు. పలువురు కార్పొరేటర్లు, అధికారులు, నాయకులు మేయర్ నివాసానికి వెళ్లి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. జడ్పీసీఈవో దీక్షారైనా, కుటుంబ సభ్యులతో కలిసి కాకర్లు కాల్చారు.

తిరుమలాయపాలెం: మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు.




వేడుకల్లో పాల్గొన్న మేయర్ నీరజ, కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

ట్రేడ్‌లైసెన్స్‌ల వ్యాపారం

- టపాసుల దుకాణాల్లో నిబంధనలు బేఖాతర్
- ట్రేడ్ లైసెన్స్ ఒకరిది.. టపాసులు అమ్మింది మరోకరు
- పరిశీలించకుండా ఇచ్చినందుకు పైసల్
- ప్రమాదాలు జరిగితే గుర్తింపు ఎలా



ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): దీపావళి టపాసుల దుకాణం కేటాయింపులు ఇప్పుడు ఖమ్మం నగర పాలక సంస్థలో అవినీతికి చర్చనీయాంశంగా మారాయి. గతంలో కంటే వివాదంగా మారటం వెనుక సిండికేట్ చేతివాటం ఉందని బాహాటంగా విమర్శలు వెలువడుతున్నాయి. పైసలిస్తే కనీస పరిశీలన లేకుండానే ట్రేడ్ లైసెన్స్‌లు మంజూరు జరుగుతాయనే చర్చ జరుగుతుంది. పండుగ ముగిసినా అవినీతి టపాసులు పేలుతూనే ఉన్నాయి. కాగా ఈ విషయంపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య విచారణ చేపట్టారు.

సిండికేట్ ట్రేడింగ్

నగరంలోని పెవీలియన్ మైదానంతో పాటుగా ప్రభుత్వ పీజీ కాలేజీ మైదానంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేశారు. పోలీసుశాఖ నుంచి మొత్తం 148 దరఖాస్తులు తత్కాలిక ట్రేడ్‌లైసెన్స్‌ల కోసం సిఫారసులు చేశారు. ఒక్కోట్రైడ్‌లైసెన్స్‌కు రూ.3వేలు కేఎంసీ అధికారులు ధర నిర్ణయించారు. వీరిలో 144 మందికి ట్రైడ్‌లైసెన్స్‌లు మంజూరు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ట్రైడ్ లైసెన్స్‌లు మంజూరు సమయంలో కేఎంసీ అధికారులు సరైన నిబంధనలు, పరిశీలన పాటించలేదని తెలుస్తోంది. పోలీసుశాఖ నుంచి వచ్చిన జాబితాను పరిశీలించిన తర్వాతనే ట్రైడ్‌లైసెన్స్‌లు మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ కేఎంసీలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఆపై స్థాయిలోని కొంతమంది అధికారులు కలిసి ఒక్కో దుకాణానికి రూ.500చొప్పున అదనంగా వసూలు చేసి లైసెన్స్‌లు జారీ చేశారని బహిరంగంగా చర్చ జరిగింది. ఒక్కో దుకాణానికి రూ.3వేలకు బదులుగా రూ.3,500 ఇచ్చామని పలువురువ్యాపారులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవ్వరూ..

దీపావళి టపాసుల అమ్మకాల సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రైడ్ లైసెన్స్ పొందిన వారు మాత్రమే టపాసుల వ్యాపారం చేస్తే ఏదైనా జరిగితే వారిని గుర్తించేందుకు ఇన్స్‌రెన్స్, ఇతర పథకాల ద్వారా పరిహారం చెల్లించేందుకు వెసులుబాటు ఉంటుంది. కానీ ఖమ్మం నగరంలో టపాసుల దుకాణంలో బీనామీ వ్యాపారులే అమ్మకాలు జరిపారు. ఒరిజనల్‌గా ట్రైడ్ లైసెన్స్ పొందిన వ్యాపారులు చాలా తక్కువగా ఉన్నారు. సిండికేట్‌గా వ్యవహరించిన వ్యక్తులు దీపావళి దుకాణాలకు సమీప బంధువులు, స్నేహితులు, కొంతమంది దరఖాస్తుదారులతో ట్రైడ్‌లైసెన్స్‌లు తీసుకున్నారు. తర్వాత వాటిని బీనామీ వ్యాపారులకు అమ్మకాలు జరిపి టపాసుల వ్యాపారం చేయించారని విమర్శలు వెలువడుతున్నాయి.

విచారణ చేపట్టిన అధికారులు

కాగా దీపావళి టపాసుల అవినీతి వ్యవహారం ఖమ్మం నగర పాలక సంస్థలో హాట్ టాపిక్‌గా మారింది. దీంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. శానిటరి ఇన్‌స్పెక్టర్లు నుంచి పైస్థాయిలో అధికారుల చేతివాటం బయట పడే అవకాశం ఉంది.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత రావొద్దు

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణానికి ఇసుక లభ్యతపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ప్రతీ సోమవారం లబ్ధిదారులకు నిర్మాణ పురోగతి ఆధారంగా బిల్లులు చెల్లించనున్నట్లు తెలిపారు. చింతకాని, బోనకల్‌మండలాల్లో ఇసుక సమస్య కారణంగా నిర్మాణం ఆలస్యం అవుతుందని, ఈ సమస్య పరిష్కారానికి ముదిగొండ మండలం నుంచి ఇసుక స్టాక్ తెప్పించి చింతకాని, బోనకల్ మండలాల్లో ఇసుక డంప్ ఏర్పాటు చేయాలన్నారు. ఈసమావేశంలో తహసీల్దార్లు, హౌసింగ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ సమస్యలను పరిష్కరించాలి

జాతీయరహదారి 163జీ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టర్‌క్యాంపు కార్యాలయంలో ఆయన జాతీయ రహదారి 163జీ పెండింగ్ భూసేకరణ అంశాలపై అధికారులతో మంగళవారం సమీక్షించి పలు సూచనలు చేశారు. రఘునాధపాలెం మండలంవీవీపాలెంలో 2.32 హెక్టార్ల భూసేకరణ 3డీ గెజిట్ ప్రచురించి నవంబర్ చివరి నాటికి అవార్డు పాస్ చేసి భూ సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. చింతకాని మండలం వందనంలో పెండింగ్ స్ట్రక్చర్ పరిహారం చెల్లింపు వేగవంతం చేయాలన్నారు. ఖమ్మం- విజయవాడ ప్యాకేజీ 2 కింద ఎర్రుపాలెం మండలంలోని రెమిడిచెర్ల, ఎర్రుపాలెం, తక్కులపాడు గ్రామాలలో రీ-సర్వే ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, దీనిని ఖమ్మం ఆర్డీవో పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. వరంగల్ -ఖమ్మం ప్యాకేజీ3కి సంబంధించి ఖమ్మం రూరల్ మండలంతీర్దాల,రేగుల చలక, కామాంచికల్‌గ్రామాల బాధితులకు పరిహారం పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో నేషనల్ హైవే పీడీ దివ్య, తహసీల్దార్లు, కలెక్టరేట్ భూసేకరణ విభాగం సెక్షన్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రైజింగ్ సిటిజన్ సర్వేలో పాల్గొనాలి

రాష్ట్ర భవిష్యత్ కోసం ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేలో పాల్గొనాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు ఈసిటిజన్ సర్వేలో తెలంగాణాలో వివిధ ప్రాంతాల ప్రజలు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందించారని తెలిపారు. దేశస్వాతంత్రానికి వందేళ్ల 2047 నాటికి పూర్తవుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజలనుంచి సలహాలు, సూచనలను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేను గత వారం ప్రారంభించిందని ఈ సర్వే ఈనెల 25న ముగుస్తుందన్నారు. డబ్ల్యూ.డబ్ల్యూ. డబ్ల్యూ. తెలంగాణ . జీవోవి. ఇన్ వెబ్‌సైట్‌లో సలహాలు సూచనలు ఇవ్వాలని కలెక్టర్ అనుదీప్ కోరారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మంరూరల్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సమప్రాధాన్యం కల్పిస్తున్నామని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొండాపురంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, తల్లంపాడులో సూర్యాపేట ఆర్‌అండ్ బీరోడ్డు నుంచి లక్ష్మీపురం వయా తల్లంపాడు నుంచి తెల్దారుపల్లి వరకు నిర్మించనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులకు, అంతర్గత రోడ్ల నిర్మాణానికి మంత్రి పొంగులేటి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ హరినాదబాబు, నాయకులు బండి జగదీష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రావు, శివారెడ్డి, అంబేద్కర్, తమ్మినేని నవీన్ పాల్గొన్నారు. మద్దులపల్లిలోని నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి పొంగులేటి పరిశీలించారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి పొంగులేటి

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

కూసుమంచి: మండలంలోని పెరికశింగారం గ్రామానికి చెందిన దేవల దుర్గకు రూ.5లక్షల విలువైన బీమా చెక్కును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందజేశారు. కొన్ని సంవత్సరాల క్రితం దుర్గ భర్త కొండలరావు విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖనుంచి రూ.5లక్షలు మంజూరీ కావడంతో క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చెక్కును మంత్రి చేతులమీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్, మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, గట్టుసింగారం మాజీ సర్పంచి చాట్ల పరుశురాం, కాంగ్రెస్ నాయకులు ఏడుకొండలు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు ప్రభుత్వ శాఖల అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమావేశం అయ్యారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై సమీక్షించారు. జరుగుతున్న పనులు, చేపట్టాల్సిన పనులను తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను వేగిరం చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

పోలీసుల త్యాగాలు వృథా కానివ్వం

నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్



పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న నేలకొండపల్లి ఎస్ఐ, సిబ్బంది

నేలకొండపల్లి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరుల త్యాగాలు వృథా కానివ్వమని నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. పోలీస్ అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం ఎస్ఐ సంతోష్ మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడటంలో పోలీసులు ఎప్పుడూ ముందుంటారన్నారు. విధినిర్వహణలో ఎంతో మంది పోలసులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని, అటువంటి త్యాగమూర్తుల త్యాగాలు వృథా కావన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్‌తో పాటు ఏఎస్ఐలు మల్లయ్య, కోటేశ్వరరావు, హెచ్‌సీలు మహ్మద్ ఖాసీం, రాంసింగ్, హనుమంతు, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి

ఖమ్మంరూరల్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ప్రభుత్వం రైతులనుఆదుకోవాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, ఏఐకేఎస్ పాలేరు డివిజన్ నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వర్లుఅన్నారు. మండల పరిధిలోని ఎమ్ వెంకటాయపాలెంలో వర్షాలకు దెబ్బతిన్న పత్తిపంటలను మంగళవారం రైతుసంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఎకరానికి రూ.50వేలు పెట్టుబడి పెడితే కనీసం రూ.20వేల పంట కూడా చేతికి రాలేదన్నారు. ఎంవీపాలెం గ్రామానికి చెందిన వేమన వెంక్రటాములు 16ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తిసాగు చేస్తే ఎకరానికి 2 క్వింటాలు మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం డివిజన్ నాయకుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, నాయకులు సుదర్శన్ రెడ్డి, చావా నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, నంద్రా ప్రసాద్; నాగేశ్వరరావు, సత్యనారాయణ, వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుదిదశకు వీధివ్యాపారుల డిపాజిట్లు

- రూ.10వేల చొప్పున 210మంది చెల్లింపులు
- మార్కెట్, మెప్మా అధికారులతో కార్పొరేటర్ సమీక్ష



కార్పొరేటరు విజయ సమక్షంలో డిపాజిట్లు తీసుకుంటున్న ఈవో

ఖమ్మంకార్పొరేషన్,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వీధివ్యాపారుల డిపాజిట్లు కొలిక్కి వచ్చింది. పక్షం రోజులుగా వీధివ్యాపారుల కూరగాయాల మార్కెట్‌లో మెప్మా, మార్కెటింగ్ అధికారులు సంయుక్తంగా డిపాజిట్లు సేకరించారు. అనేక వత్తుడులు, సిపారసులు ఎదురైనా అధికారులు వెనక్కి తగ్గలేదు. ఎట్టకేలకు డిపాజిట్లు సేకరణను తుదిదశకు చేరింది. మంగళవారం వరకు 210మంది వరకు వ్యాపారులు డిపాజిట్లు చెల్లించారు. దివ్యాంగులు నుంచి మాత్రం రూ.5వేలు డిపాజిట్లు సేకరించగా కూరగాయల వ్యాపారుల నుంచి రూ.10వేల చొప్పున చెల్లించారు. అయితే ఎప్పటి నుంచి వ్యాపారం చేస్తున్న మరికొంతమంది వ్యాపారులు మాత్రం ఇప్పటి వరకు చెల్లించలేదని తెలుస్తోంది. వారికోసం మరోఅవకాశం ఇచ్చేందుకు మెప్మా, మార్కెటింగ్ అధికారులు బుధవారం వరకు గడువు పెంచినట్లు సమాచారం.

సమావేశమైన కార్పొరేటర్

రైతుబజార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పాలేపు విజయ మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, మార్కెటింగ్ ఈవో శివరామకృష్ణతో సమావేశమయ్యారు. వీధివ్యాపారుల మార్కెట్, రైతుబజార్ అభివృద్ధిపై సమీక్షించారు. మార్కెట్లు మరమ్మతులు పాటుగా సోలార్ విద్యుత్ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను తెలుసుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే తొలిసారిగా ఖమ్మంలోనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు బజార్‌ను ప్రారంభించారు. రాష్ట్రంలోనే మోడల్‌గా కూరగాయల మార్కెట్‌లు నిర్మాణం జరపాలని కార్పొరేటర్ పాలేపు విజయ సూచించారు. ఆర్పీలు సునీత, ఉమా పాల్గొన్నారు.

ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమం

మేయర్ పునుకొల్లు నీరజ



చెక్కులు పంపిణీ చేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఖమ్మం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యత ఉందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. మంగళవారం 55వ డివిజన్ లో కాంగ్రెస్ నాయకులు పోట్ల వీరేందర్‌తో కలిసి మేయర్ కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి అందించారు.

మాజీసర్పంచ్ కుటుంబానికి కందాళ పరామర్శ

కూసుమంచి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కేపల్లి గ్రామానికి చెందిన రాయబారపు రమేష్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల రమేష్ తల్లి కొండమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈనేపథ్యంలో కొండమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కందాళ వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న కందాళ

డీసీసీ పీఠాలు దక్కేదెవరికో?

(5వ పేజీ తరువాయి)

కూడా పోటీ గట్టిగానే ఉంది. కొత్తగా దరఖాస్తు చేసిన వారితోపాటు ఎమ్మెల్యేల ద్వారా పలువురు సిఫార్సులతో అధ్యక్ష పదవి దక్కించుకోవాలని ఎవరికి వారు ఆరాటపడుతున్నారు ప్రస్తుతం జిల్లా అధ్యక్షులుగా ఉన్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పొదెం వీరయ్య తిరిగి దరఖాస్తు చేయకపోయినా సామాజిక సమీకరణలు, పార్టీలోని వర్గవిభేదాలు తమకు కలిసొస్తాయని భావిస్తున్నాయి. తమను తిరిగి కొనసాగించాలని పార్టీ నిర్ణయిస్తే అందుకు తాము సుముఖంగానే ఉన్నట్టు వారు పరిశీలకులకు అభిప్రాయం తెలిపినట్టు తెలుస్తోంది. మొత్తంమీద ఉమ్మడి ఖమ్మం జిల్లాఅధ్యక్షుల విషయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్ణయం కీలకం కానుంది. రాష్ట్రస్థాయిలో పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితోపాటు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా జాబితాను సమీక్షించి ఏఐసీసీకి పంపే సమయంలో వీరి అభిప్రయాలను పరిగణలోకి తీసుకోనున్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాఅధ్యక్షుల సామాజిక సమీకరణాలు కూడా పదవి ఇచ్చే విషయంలో ప్రామాణికం కానున్నాయి.

గోశాలలకు దాణా వితరణ

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీస్తంభాద్రి సేవాసమితివారి ఆధ్వర్యంలో వివిధ గోశాలలకు దాణా అందజేశారు. సోమవారం మిత్ర ఫౌండేషన్, రుక్మిణి సిల్క్స్ యాజమాన్యం, స్థానిక దాల్ మిల్ యజమానులు, గ్రేయిన్ మార్కెట్ వ్యాపారులు, మిత్రులు, సేవా సమితి సభ్యులుగోభక్తుల ద్వారా వీటిని సేకరించారు. గొల్లగూడెంలోని శ్రీకృష్ణ గోశాల వారికి రూ.47వేలు, టేకులపల్లిలోని శ్రీవెంకటేశ్వర గోశాలకు రూ.20 వేలు, ఖమ్మంరూరల్ మండలములోని వెంకటాయపాలెం కమల గోశాలకు రూ.39వేలు,గుంటిమల్లేశ్వరస్వామి గోశాలకు రూ.2వేలు, లక్ష్మీరంగనాధ గోశాల వారికీ రూ.2 వేలువిలువ గల బెల్లం బాక్స్ లు, తవుడు, మినప, పెసర, కంది, బొబ్బరచున్నీ, వరిపేలాలు దాణాను అందించారు. ఈకార్యక్రమంలోసేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనరసింహరావు, సభ్యులు దేవరశెట్టి రామారావు, సూరినేటి మల్లేశం, పెనుగొండ సాయికుమార్, వంగవీటి నవీన్ పాల్గొన్నారు.

బీమా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమామిళ్లగూడెం,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ బీమా పథకాలు పోస్టల్ జీవిత బీమా పీఎల్ఐ,గ్రామీణ తపాలా జీవితబీమా (ఆర్పీఎల్ఐ) లకు సంబందించి కమీషన్ పద్ధతిలో నియమించేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి తెలిపారు. పదోతరగతి పూర్తి చేసి, 18ఏళ్ల వయస్సు నిండిన నిరుద్యోగులు, గృహిణులు అంగన్‌వాడీ సేవకులు, మహిళా మండలి సేవకులు, మాజీ సైనిక ఉద్యోగులు, రిటైర్ ప్రభుత్వ ఉద్యోగులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్ధులు ఈనెల27 లోపు దరఖాస్తులను పోస్టల్ సూపరిన్‌టెండెంట్ కార్యాలయం, గాంధీచౌక్‌కు పంపించాలన్నారు.

చెస్‌లో సత్తా చాటిన న్యూ విజన్ విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్ అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీటీడి కల్యాణ మండపంలో ఆదివారం చతురంగ చెస్ అకాడమీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో న్యూ విజన్ విద్యార్థులు సత్తాచాటారు. అండర్ టెన్ విభాగంలో బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు ఐదోతరగతి విద్యార్థి పుసులూరి మోక్షజ్ఞ రాణా సాధించాడు. టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ చాటిన మోక్షజ్ఞ రాణాను ప్రిన్సిపాల్ మాధవి అభినందించారు.

ఫుట్‌బాల్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంస్పోర్ట్స్,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): సర్దార్ పటేల్ స్టేడియంలో ఫుట్‌బాల్ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు అర్హతగలిగిన కోచ్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఐఎస్ శిక్షణార్థులు, ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ లైసెన్స్ కోచింగ్ కోర్సు చేసినవారు,నేషనల్ ప్లేయర్లు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 29 కల్లా స్టేడియంలోని కార్యాలయంలో అందజేయాలని కోరారు.

సీపీఐ వందేళ్ల వేడుకలను విజయవంతం చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

ఖమ్మంరూరల్,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): సీపీఐ వంద ఏళ్ల వేడుకను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు.ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని ఏదులాపురంలో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ వేడుక ఖమ్మంలో జరుపుకునే అవకాశం రావడం మనందరి అదృష్టం అన్నారు. ఈ సమావేశంలో వెంకటరెడ్డి, శేషగిరి, భాస్కర్, సురేందర్, రామకోటి, శ్రీనాథ రెడ్డి, వెంకన్న, వీరబాబు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



సాగునీటి కోసం రైతుల ఆందోళన

తల్లాడ, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్పీ ఆయకట్టు పరిధిలో సాగునీరందక పొట్టదశలో ఉన్న వరిపైరు ఎండిపోతుండడంతో మంగళవారం తల్లాడలోని ఎన్ఎస్పీ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా చేశారు. ఎన్ఎస్పీ తెలగారం మైనర్‌కాలవ ఆయకట్టు పరిధిలోని అంజనాపురం గ్రామంలో సాగు చేసిన వరిపైరు పొట్టదశలో ఉంది. తెలగారం మైనర్ కాలవలో పూడిక పేరుకుపోయి పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి, కాలవలో క్రమంగా సాగునీరు సరఫరాకాకపోవడంతో ఆయకట్టు భూములకు సాగు నీరు అందని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈ నేపథ్యంలో నీటిపారుదలశాఖ ఏఈ ఆయేషా తెలగారం మైనర్ కాలవసాగునీటి సరఫరాను పరిశీలించారు. నల్లమోతు మోహనరావు, అయినాల రామ లింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, అనేమలు కృష్ణయ్య, నాగేశ్వరరావు, నరేష్, చందు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి



గ్రూప్-1 విజేతలను సన్మానిస్తున్న వీవీ స్కూల్ యాజమాన్యం

సత్తుపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని వీవీ విద్యాలయం నిర్వాహకులు ఒగ్గు భగవాన్‌రెడ్డి అన్నారు. టీజీపీఎస్సీ గ్రూప్-1లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి కొలువులు పొందిన గోలి హివర్షిణి(డీఎస్పీ), తాటి ప్రమోద్‌సాయి(మెడికల్,హెల్త్‌లో అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్)లను మంగళవారం ఘనంగా సన్మానించారు. తమ పాఠశాల పూర్వ విద్యార్థులు కావడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని, అసాధారణ ప్రతిభతో ఇంతటి విజయాలు సాధించిన ఈ ఇరువురు తల్లిదండ్రులకు గొప్ప పేరుప్రఖ్యాతలు తేవాలని, సత్తుపల్లి కీర్తిప్రతిష్ఠలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, ఎల్ఐసీ ఏజంట్ గోలి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా సృజన సాహితీ సమాఖ్య నిర్వాహకులు జీ.రామకృష్ణ, బీ.మధుసూదనరాజులు గోలి హిమవర్షిణీని సన్మానించారు.

పాఠశాల స్థాయి నుంచే విద్యతో పాటు క్రమశిక్షణ, ఇతరులకు సాయం చేయడం, భవిష్యత్తుపై కార్యాచరణవంటి ఎన్నో విషయాలను నేర్చుకున్నామని గ్రూప్-1 సివిల్ సర్వీసెస్ సాధించిన గోలి హివర్షిణి, తాటి ప్రమోద్‌సాయిలు అన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలపై దృష్టిపెట్టాలని కోరారు.



సత్తుపల్లిలో దీవాళీ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర కుటుంబ సభ్యులు



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టపాసులు పేల్చుతున్న దయానంద్

దీపావళి పండుగ వేడుకలు సత్తుపల్లి, వైరా, మధిర నియోజకవర్గాల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాల్లో భక్తులు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్ల ముందు పూలతో ఆకర్షణీయంగా అలంకరించి దీపాలను వెలిగించారు. యువతీ, యువకులు బాణసంచా కాల్చి ఉత్సాహంగా గడిపారు.



చింతకానిలో...



మధిరలో...



కొణిజర్లలో టపాసులు కాలుస్తున్న మహిళలు



నరసింహారావుపేటలో దీపాలు వెలిగిస్తున్న యువతి

ఉపముఖ్యమంత్రి భట్టిని కలిసిన కాంగ్రెస్ నాయకుడు మనోహర్



భట్టికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మనోహర్‌బాబు

చింతకాని, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మంగళవారం ప్రజాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకుడు, చింతకాని సొసైటీ డైరక్టర్ కిలారు మనోహర్‌బాబు కలసి పుష్పగుచ్ఛం అందించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు, పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. నల్లచెరువు పెద్ద తూము మరమ్మతులు గురై సాగు నీరు చివరి భూములకు అందడంలేదని తూము కాలువను కాంక్రీట్ కాలువగా మార్చాలని కోరారు.

పోలీస్ అమరవీరులకు శ్రద్ధాంజలి

వైరా, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వైరాలో మంగళవారం రాత్రి పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఈ కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. సీఐ ఎన్.సాగర్, ఎస్ఐ పుష్పాల రామారావు, ట్రెయినీ ఎస్ఐ వెంపటి పవన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, డాక్టర్ కాపా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంకోసం, సమాజం కోసం అమరులైన పోలీసులకు మంగళవారం గంగారంలోని 15వ పోలీస్ బెటాలియన్‌లో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అశువులు బాసిన వారికి స్మృతివనం వద్ద కమాండెంట్ ఎన్.పెదబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఏ.అంజయ్య, అధికారులు పాల్గొని నివాళులర్పించారు.



గంగారం బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న ఉద్యోగులు



వైరాలో అమరవీరుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఎరువుల దుకాణాల తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ కరుణశ్రీ

కారేపల్లి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ ఎరువుల దుకాణాలను అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గోడౌన్లలో ఉన్న ఎరువులకు పీవోఎస్, మిషన్లలో ఉన్న స్టాకును పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి బట్టు అశోక్‌కుమార్, ఏఈఓలు పాల్గొన్నారు.

డీసీసీ పీఠాలు దక్కేదెవరికో?

(5వ పేజీ తరువాయి)

కూడా పోటీ గట్టిగానే ఉంది. కొత్తగా దరఖాస్తు చేసిన వారితోపాటు ఎమ్మెల్యేల ద్వారా పలువురు సిఫార్సులతో అధ్యక్ష పదవి దక్కించుకోవాలని ఎవరికి వారు ఆరాటపడుతున్నారు ప్రస్తుతం జిల్లా అధ్యక్షులుగా ఉన్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పొదెం వీరయ్య తిరిగి దరఖాస్తు చేయకపోయినా సామాజిక సమీకరణలు, పార్టీలోని వర్గ విభేదాలు తమకు కలిసొస్తాయని భావిస్తున్నాయి. తమను తిరిగి కొనసాగించాలని పార్టీ నిర్ణయిస్తే అందుకు తాము సుముఖంగానే ఉన్నట్టు వారు పరిశీలకులకు అభిప్రాయం తెలిపినట్టు తెలుస్తోంది. మొత్తంమీద ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుల విషయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్ణయం కీలకం కానుంది. రాష్ట్రస్థాయిలో పీసీసీ అధ్యక్షుడు, సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా జాబితాను సమీక్షించి ఏఐసీసీకి పంపే సమయంలో వీరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోనున్నారు. రాష్ట్రస్థాయిలో జిల్లా అధ్యక్షుల సామాజిక సమీకరణాలు కూడా పదవి ఇచ్చే విషయంలో ప్రామాణికం కానున్నాయి.

ముస్తాబైన శివాలయాలు

కల్లూరు, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా కల్లూరు పరిసర ప్రాంతాల్లోని శివాలయాలు విద్యుత్ దీపాల అలంకరణతో సందరంగా ముస్తాబయ్యాయి. కల్లూరులోని ఎన్నెస్పీ క్రాస్ రోడ్డు వద్ద గల శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి శివాలయం, శ్రీ కాశ్మీర మహాదేవర క్షేత్రం (శివాలయం), పెద్దచెరువు కట్టపై గల శివాంజనేయ ఆలయాలు విద్యుత్ దీపాల కాంతులతో శోభిలుతున్నాయి.



ముస్తాబైన వీరభద్రస్వామి శివాలయం